# పనులు సాగవు.. అవస్థలు తప్పవు

- ఏడాదిన్నరగా ప్రారంభం కాని రహదారి పనులు
- రూ.58 లక్షలతో శ్రీకారం
- శిలాఫలకానికే పరిమితం
- రైతులకు తప్పని తిప్పలు
- పరిష్కారానికి గ్రామస్తుల వినతి


పెంబట్ల నుంచి రంగపేట వైపు వెళ్లే మట్టిరోడ్డు..

**సారంగాపూర్:** మండలంలోని పెంబట్ల గ్రామ రైతుల సమస్యను తీర్చడానికి చేపట్టిన పనులు ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**రైతుల సమస్య ఇది..**
మండలంలోని పెంబట్ల గ్రామ రైతులు తమ పంట పొలాలు గ్రామానికి కేవలం అరకిలోమీటరు దూరంలో ఉంటాయి. పంట పొలాలకు వెళ్లడానికి గ్రామ ఊర చెరువు కట్ట మీది నుంచి పొలాలకు చేరుకోవాలి..అయితే కట్టమీది నుంచి మధ్యలో ఉన్న చెరువు మత్తడి దాటుకుంటూ నీళ్ల నుంచి పొలాలకు చేరుకోవాల్సి ఉంటుంది. ఎప్పుడు నీటి ప్రవాహం ఉండడం, వర్షాకాలంలో ఈ ప్రవాహ ఉధృతి మరింత ఎక్కువగా ఉండడంతో గ్రామంలోని వందలాది మంది రైతులు పెంబట్ల నుంచి లక్ష్మీదేవిపల్లి మీదుగా 5 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోంది. ఈ సమస్య పరిష్కరించాలని అప్పట్లో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి గ్రామస్తులు విన్నవించారు.

**రూ. 58 లక్షలతో చేపట్టిన పనులు..**
చెరువు కట్ట మీది నుంచి రంగపేట వెళ్లే దారిలో ఉన్న పెద్దమ్మ ఆలయం వరకు కిలోమీటరు పొడవుతో రోడ్డు నిర్మాణంతో పాటు, మత్తడి, వాగు వద్ద కల్వర్టు నిర్మాణం కోసం 2023 అక్టోబర్‌లో పనులు ప్రారంభించారు. ఇప్పటి వరకు పనుల్లో ఎలాంటి పురోగతి లేకపోవడంతో రైతుల్లో అసహనం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా పనులు ప్రారంభించి పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### పొలాలకు వెళ్లలేక పోతున్నాం



అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి 16 నెలల క్రితం పనులు ప్రారంభించారు. ఇప్పటి వరకు పనులు మాత్రం ప్రారంభం కాలేదు. వర్షాకాలంలో చాలా సమస్య ఏర్పడుతుంది. వర్షాలు ఎక్కువగా పడితే పొలాలకు వెళ్ల లేకపోతున్నాం.వెంటనే పనులు ప్రారంభించాలి.

– తేలు రాజు, పెంబట్ల

### అధికారులు చర్యలు తీసుకోవాలి



మేము చేసుకునేది వ్యవసాయం, మాకు రోజు నాలుగుసార్లు పొలాలు, ఇతర పంటల వద్దకు వెళ్లాలి, రోడ్డు నిర్మిస్తే కేవలం 1 కిలోమీటరు దూరం కాలినడకన వెళ్లవచ్చు, లక్ష్మీదేవిపల్లి మీది నుంచి పోవడం మాకు చాలా సమస్య అవుతోంది.

– బందారి వెంకటేశ్, పెంబట్ల

### టెండర్లు, అగ్రిమెంట్ పూర్తయింది

పనులకు టెండర్లు, కాంట్రాక్టర్ పనులకు అగ్రిమెంట్ పనులు పూర్తి అయ్యాయి. ఈ నెలలోనే పనులు ప్రారంభించడానికి అన్ని చర్యలు తీసుకుంటాం...నాలుగు నెలల్లో పనులు పూర్తి చేస్తాం. రోడ్లు సకాలంలో పూర్తి చేయించేందుకు కృషి చేస్తున్నాం.

– రాజమల్లయ్య,ఏఈ సారంగాపూర్



సారంగాపూర్: మండలంలోని పోతారం శివారు గ్రామం గణేష్‌పల్లిలో మురికికాల్వల నిర్మాణం లేకపోవడంతో ఇళ్లలోని మురికినీరు బీర్‌పూర్-సారంగాపూర్-జగిత్యాలకు వెళ్లే ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపైకి వచ్చి చేరుతుంది. దీంతో అటు ఇంటిని నిర్మాణాలు చేసుకున్న వారితో పాటు, రహదారి వెంట వెళ్తున్న వారు ఇబ్బంది పడుతున్నారు. మురికి కాల్వల నిర్మాణం చేపట్టాలని గ్రామానికి చెందిన ఇదగొట్టు గోవింద్ అధికారులను కోరారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి: చౌడారపు గంగాధర్ ఎంపీడీవో,సారంగాపూర్, సెల్ నంబర్: 94404 68508

**వాట్సాప్ చేయండి..**

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

## క్లుప్తంగా

### డీఈవో కలిసిన యూటీఎఫ్ నాయకులు


డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

**జగిత్యాల:** జిల్లాలో ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ అధ్యక్షుడు శ్యామ్‌సుందర్ అన్నారు. శనివారం డీఈవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులగణన సర్వేలో సెలవులో పాల్గొన్న ఉపాధ్యాయులకు ప్రత్యేక సెలవులు మంజూరు చేయాలని, గత వేసవి సెలవుల్లో ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, భూమేశ్ పాల్గొన్నారు.

### నవోదయ పాఠశాల కోసం స్థల పరిశీలన


తహసీల్దార్‌ను వివరాలు అడుగుతున్న జాయింట్ డైరెక్టర్

**కోరుట్ల రూరల్:** పట్టణ శివారులోని సంగెం రోడ్డులో గల జంబి గద్దె ప్రాంతంలో ప్రభుత్వ స్థలంలో జవహర్ నవోదయ పాఠశాల ఏర్పాటు కోసం శనివారం స్థలం పరిశీలించారు. కార్యక్రమంలో జవహర్ నవోదయ స్టేట్ జాయింట్ డైరెక్టర్, చొప్పదండి నవోదయ పాఠశాల ప్రిన్సిపాల్, తహసీల్దార్ కిషన్, ఆర్ఐలు రాజేందర్ రావు,అమర్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### మిషన్ భగీరథ నీటిని తాగొద్దు

**మెట్‌పల్లి:** ఇబ్రహీంపట్నం మండలం డబ్బా వాటర్ గ్రిడ్ నుంచి వచ్చే మిషన్ భగీరథ నీరు రంగు మారి వస్తున్నందునా ప్రజలు ఆ నీటిని తాగొద్దని మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ మోహన్ తెలిపారు. శనివారం ట్యాంక్‌ల్లోకి నీరు పచ్చగా రావడం గమనించినట్లు తెలిపిన ఆయన,ఆ నీటిని ఇతర అవసరాలకు వాడుకోవాలని సూచించారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని పేర్కొన్నారు.

### బాగా చదివి ఉద్యోగాలు సాధించాలి


పాఠకులతో మాట్లాడుతున్న తహసీల్దార్

**కోరుట్ల:** పట్టణంలోని సి.ప్రభాకర్ స్మారక గ్రంథాలయాన్ని తహసీల్దార్ కిషన్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠకులతో మాట్లాడారు. గ్రంథాలయం ఆధ్వర్యంలో ఉద్యోగాల కోసం ప్రిపేర్ అవుతున్న వారి కోసం స్టడీ మెటీరియల్ అందుబాటులో ఉంచటం అభినందనీయమన్నారు. ఉద్యోగాల కోసం ప్రిపేర్ అవుతున్న వారితో మాట్లాడారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధ్యక్షుడు రాస భూమయ్య, గౌరవ అధ్యక్షుడు చెన్న విశ్వనాథం, ప్రజా సంఘాల జేఏసి రాష్ట్ర అధ్యక్షుడు పేట భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

### ఆంగ్ల భాష దినోత్సవం


ఫొటో ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

**కథలాపూర్:** మండలంలోని గంభీర్‌పూర్ జెడ్పీ హైస్కూల్‌లో శనివార ఆంగ్ల భాష దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఇంగ్లిష్ రచయితల ఫొటోలతో ప్రదర్శన ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు ఇంగ్లిష్ సబ్జెక్టుపై వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుధాకర్‌రెడ్డి, ఇంగ్లిష్ టీచర్ సంజీవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మల్లన్న స్వామి శోభాయాత్ర

**కోరుట్ల:** పట్టణంలోని మల్లికార్జున స్వామి జాతర మహోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారి శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. ఆదివారం జాతర, పట్నాలు, భక్తులకు అన్న ప్రసాద వితరణ, సాయంత్రం బోనాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

## సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలు



రాయికల్ మండలం లోక్యానాయక్‌తండా, మెట్‌పల్లి మండలం ఏఎస్‌ఆర్ తండాలలో గిరిజనుల పూజలు

**రాయికల్/పెగడపల్లి/మల్లాపూర్:** సంత్‌సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా పలువురు తండావాసులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాయికల్ మండలం లోక్యానాయక్‌తండా, మెట్‌పల్లి మండలం అల్లూరి సీతారామరాజు తండా(ఏఎస్ఆర్),పాటిమీది తండా,పెగడపల్లి మండలంలోని ఏడుమోటలపల్లి, మద్దులపల్లి, రాజారాంపల్లి తాండాలో శనివారం గిరిజనులు భోగ్ భండార్ నిర్వహించడంతో పాటు సంత్ సేవాలాల్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహరాజ్ చేసిన సేవలను కొనియాడారు. సేవాలాల్ మార్గం అనుసరణీయమన్నారు. కార్యక్రమాల్లో వివిధ పార్టీల నాయకులు, గిరిజన నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

### ఎమ్మెల్సీ ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి

**ఇబ్రహీంపట్నం:** ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ ప్రసాద్ శనివారం తెలిపారు. మండలంలో గ్రాడ్యుయేట్ ఎన్నికకు 611 మంది ఓటర్లు ఉన్నారని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు 21 మంది ఓటర్లు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఇబ్రహీంపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

**మండలంలో 39,462 మంది ఓటర్లు**
**రాయికల్:** మండలంలో 39,462 మంది ఓటర్లు ఉన్నట్లు ఎంపీడీవో చిరంజీవి తెలిపారు. శనివారం రాయికల్ మండల పరిషత్ కార్యాలయంలో తుది పోలింగ్ కేంద్రాల జాబితాను నోటీస్‌బోర్డుపై ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎంపీటీసీ స్థానాలు 14, పోలింగ్ కేంద్రాలు 77, 39,462 మంది ఓటర్లు, 18,579 మంది పురుషులు, 20,882 మంది మహిళలు, ఒకరు ఇతరులు ఉన్నారని తెలిపారు.

### యాదవులు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలి

**కథలాపూర్:** యాదవులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆ సంఘం అడ్‌హక్ కమిటీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్ అన్నారు. శనివారం కథలాపూర్ మండలం అంబారిపేటలో యాదవసంఘం సమావేశం నిర్వహించారు. యాదవులకు కుల సంఘం సభ్యత్వ పత్రాలు అందించారు. ఈ సమావేశంలో మండల ప్రతినిధులు రాచర్ల రవి, రామాంజనేయులు, మధు, రమేశ్,పాల్గొన్నారు.

### కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న రాంమోహన్

**జగిత్యాల:** భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని భారతీయ మజ్దూర్ సంఘ రాష్ట్ర సంఘటన కార్యదర్శి రాంమోహన్ అన్నారు. స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కమిటీలు కలిసికట్టుగా పోరాడాలన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు అందరు కలిసికట్టుగా ఉండాలన్నారు. అనంతరం జగిత్యాల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దక్షిణ మధ్య కార్మిక సంఘం నుంచి మల్లేశం, జిల్లా కార్యదర్శిగా నక్క అశోక్, ఉపాధ్యక్షులుగా కొండపత్తిని గంగాధర్, జగన్, పడకంటి శారద, సహాయ కార్యదర్శిగా యాదగిరి, నల్లూరి రమేశ్, అరుణ్, వేణు, విజయేందర్‌రెడ్డి ఎన్నికయ్యారు.

### మరమ్మతు పనుల పరిశీలన

**జగిత్యాలఅగ్రికల్చర్:** జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుండడంతో శనివారం విద్యుత్‌ను పునరుద్ధరించారు. ఈ పనులను స్వయంగా జగిత్యాల ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సాలియా నాయకర్ దగ్గరుండి పర్యవేక్షించారు. కార్యక్రమంలో జగిత్యాల డీఈ గోపీకృష్ణ, డీఈ టెక్నికల్ గంగారాం, ఏడీఈ జవహర్ నాయక్, ఏఈ ప్రవీణ్, టఆర్ఈ రహీమ్ పాల్గొన్నారు.

## అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు

**జగిత్యాలరూరల్:** అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించినట్లు ఎంపీడీవో రమాదేవి అన్నారు. జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లిలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో ఇళ్లులేని వారు 52 మంది ఉన్నారని, అందులో 20 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. త్వరలోనే సంబంధిత అధికారుల సమక్షంలో ఇంటి నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. చదంజరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీవో రవిబాబు, కార్యదర్శి మహేశ్ పాల్గొన్నారు.

**రాయికల్:** మండలంలోని ధర్మాజీపేటలో శనివారం లబ్ధిదారులతో ఎంపీడీవో చిరంజీవి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. గ్రామంలో 147 మంది ఇందిరమ్మ లబ్ధిదారులు భూమి చదును చేసుకునేందుకు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీవో సుష్మ, పంచాయతీరాజ్ ఏఈ ప్రసాద్, కార్యదర్శి రాజేందర్ పాల్గొన్నారు.

**కథలాపూర్:** మండలంలోని పోసానిపేటలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో శనివారం అధికారులు సమావేశం నిర్వహించారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని అధికారులు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల గురించి లబ్ధిదారుల సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, ఎంపీవో రాజశేఖర్, కార్యదర్శి సులోచన పాల్గొన్నారు.

**సారంగాపూర్:** ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి పైలెట్ ప్రాజెక్టులుగా సారంగాపూర్ మండలంలో నాయికపుగూడెం, బీర్‌పూర్ మండలంలో చిత్రవేణిగూడెం గ్రామాలను అధికారులు ఎంపిక చేసి, భూమిపూజకు ఏర్పాటు చేస్తున్నారు. నాయికపుగూడెంలో 24 మందికి, చిత్రవేణి గూడెంలో 20 ఇళ్లు మంజూరయ్యాయని, ఈ నెల 17న 18 మంది లబ్ధిదారుల ఇళ్లకు భూమిపూజ చేసి పనులు ప్రారంభిస్తామని ఎంపీడీవోలు గంగాధర్, లచ్చాలు తెలిపారు. కార్యక్రమాల్లో ఎంపీవో మహ్మద్ సలీం, ఏఈ రాజమల్లయ్య, టీఏ మహేశ్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

### యూరియా కోసం ఆందోళన వద్దు

**పెగడపల్లి:** ఖరీఫ్ సీజన్‌లో రైతుల అవసరం మేరకు యూరియా సరఫరా చేస్తామని యూరియా కొరత లేదని రైతులు ఆందోళన చెందవద్దని నంచర్ల సొసైటీ చైర్మన్ మంత్రి వేణుగోపాల్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యూరియా గురించి ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా సంబంధిత అధికారులతో మాట్లాడి శనివారం సంఘానికి 450 యూరియా బస్తాలు సరఫరా చేయగా రైతులకు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. రెండు రోజుల్లో మరిన్ని లారీల లోడు తెప్పించి పంపిణీ చేస్తామని, రైతులు సంయమనం పాటించాలని కోరారు.

**మిర్చి వ్యాన్ బోల్తా**
**ఇబ్రహీంపట్నం:** మండల కేంద్రం శివారులో శనివారం వేకువజామున ఓ మిర్చి వ్యాన్ బోల్తా పడింది. వరంగల్ నుంచి మిర్చి లోడ్‌తో నాగ్‌పూర్ వైపు వెళ్తున్న వ్యాన్ ఇబ్రహీంపట్నం శివారులోకి రాగానే అదుపుతప్పి బోల్తా పడటంతో సంచులన్నీ పొలాల్లో పడిపోయాయి. వ్యాన్ డ్రైవర్, క్లీనర్‌కు స్వల్పగాయాలయ్యాయి.

## పట్టభద్రుల సమస్యల పరిష్కారమే ధ్యేయం


రాయికల్‌లో మాట్లాడుతున్న ప్రసన్న హరికృష్ణ

**రాయికల్:** పట్టభద్రులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారమే తన ధ్యేయమని పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాయికల్, ధర్మపురిలో శనివారం పట్టభద్రులతో సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రులకు ఓటు అనేది వజ్రాయుధం లాంటిదని, ఆలోచించి పట్టభద్రులకు న్యాయం చేసే అభ్యర్థికే ఓటు వేయాలని కోరారు. కార్పొరేట్ వ్యక్తులకు, కామన్ మ్యాన్‌కు జరుగుతున్న పట్టభద్రుల ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు.న్యాయవాదుల మద్దతు కోరారు. కార్యక్రమంలో నాయకులు ముసిపట్ల రాజేందర్, నరేశ్, కైరం సత్యంగౌడ్ పాల్గొన్నారు.

## బీజేపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి


మాట్లాడుతున్న భోగ శ్రావణి

**కోరుట్ల రూరల్:** ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతీ నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల బీజేపీ కోరుట్ల నియోజకవర్గ ప్రభారి భోగ శ్రావణి అన్నారు. శనివారం కోరుట్లలో మండల స్థాయి నాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రతీ 25 మంది గ్రాడ్యుయేట్లకు ఒక నాయకుడు ఇన్‌చార్జిగా తీసుకుని కేంద్ర ప్రభుత్వం , ప్రధాని మోదీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు వివరిస్తూ ఓటు అభ్యర్థించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ జిల్లా ఇన్‌చార్జి అయ్యన్న గారి భూమన్న, నాయకులు దొనికెల నవీన్, జుంబర్తి దివాకర్,పంచిరి విజయ్, గుగ్గిళ్ల తుక్కారాంగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

**• గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డి**
**కథలాపూర్:** మండలంలోని సిరికొండ గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా కందరి కిషన్‌రెడ్డి ఎన్నికైనట్లు గ్రామస్తులు తెలిపారు. శనివారం గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు సమావేశమై ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా నీలి భూమారెడ్డి, లోకిని గంగనర్సయ్య, ప్రధానకార్యదర్శిగా ముంజ శంకర్ గౌడ్, కోశాధికారిగా కొడిపెల్లి రాజు ఎన్నికయ్యారన్నారు. నూతనంగా ఎన్నికైన ప్రతినిధులను గ్రామస్తులు శాలువాలతో సన్మానించారు.

**• భూవివాదంలో ఇద్దరిపై కేసు**
**సారంగాపూర్:** అన్నదమ్ముల మధ్య భూమి విషయంలో వివాదం ఏర్పడి ఇద్దరు ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో పోలీసులు శనివారం ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దత్తాద్రి తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం మండలంలోని రేచపల్లి గ్రామానికి చెందిన సిరికొండ మల్లయ్య, సిరికొండ నారాయణ ఇద్దరు అన్నదమ్ములు. వీరికి వారసత్వంగా వచ్చిన భూమి విషయంలో గత కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో భూమి వివాదంలో మాటా మాట పెరిగి అన్నదమ్ములు ఒకరిపై ఒకరు కర్రలతో పొలం వద్ద కొట్టుకోవడంతో ఇరువురు ఇచ్చిన ఫిర్యాదుపై ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

**• మరోసారి కులగణన హర్షనీయం**
**కోరుట్ల:** రాష్ట్ర ప్రభుత్వం మరోసారి కులగణన సర్వే చేపట్టటం హర్షనీయమని టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు చట్ట బద్ధత కల్పించేందుకు అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు పెట్టి కేంద్రానికి పంపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించటం బీసీలపై ఉన్న చిత్త శుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు.

**• బాలిక అదృశ్యంపై కేసు**
**మల్యాల:** మండలంలోని ఓ గ్రామంలో బాలిక ఇంటి నుండి వెళ్లి, తిరిగి రాకపోవడంతో అదే గ్రామానికి చెందిన వ్యక్తి బాలికను కిడ్నాప్ చేసిన ట్లుగా శనివారం బాలిక తల్లిదండ్రులు అనుమానితుడిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఈ మేరకు అనుమానితుడిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

**షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం**
**కథలాపూర్:** మండలంలోని చింతకుంటలో శనివారం రాత్రి షార్ట్‌సర్క్యూట్‌తో అలకుంట పోచయ్యకు చెందిన గుడిసె దగ్ధమైనట్లు గ్రామస్తులు తెలిపారు. పోచయ్య కుటుంబసభ్యులు రోజుమాదిరిగానే రాత్రివేళ భోజనం చేసి నిద్రించేందుకు ఉపక్రమించారు. ఇంతలోనే మంటలు చెలరేగడంతో బయటకు పరుగులు తీశారు. గ్రామస్తులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించగా, అప్పటికే గుడిసె పూర్తిగా కాలిపోయిందన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

## అగ్నిగుండంలో నడిచి.. మొక్కు చెల్లించి..


అగ్నిగుండంలో నడుస్తున్న భక్తులు

**మల్లాపూర్:** మండలంలోని రత్నాపూర్‌లో శ్రీమల్లికార్జునస్వామి జాతర మహోత్సవాలు ఐదోరోజు ఘనంగా నిర్వహించారు. అర్చకులు శివకుమార్ ఆధ్వర్యంలో శనివారం వేకువజామున 2 గంటల నుంచి అగ్నిగుండాల కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు అగ్నిగుండంలో నడిచి భక్తిని చాటుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ కూచన్‌పెల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, మాజీ జెడ్పీటీసీ దేవ ముత్తమ్మ, ప్యాక్స్ వైస్ చైర్మన్ రాజేందర్, పాల్గొన్నారు.




**కథలాపూర్:** మండలంలోని ఊటిపెల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శనివారం విజ్ఞాన విహారయాత్రకు వెళ్లారు. నిర్మల్ జిల్లా బాసరలో సరస్వతీ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం శ్రీరామసాగర్ ప్రాజెక్టు, సారంగాపూర్‌లోని హనుమాన్ ఆలయంను సందర్శించారు. వాటి చరిత్రను ఉపాధ్యాయులు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




**జగిత్యాలఅగ్రికల్చర్:** మండలంలోని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానాన్ని ఫీల్డ్ విజిట్‌లో భాగంగా జిల్లా కేంద్రంలోని బాలికల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పరిశోధన స్థానంలో జరుగుతున్న పరిశోధనల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.